## క్లుప్తంగా

### ఆర్వో ప్లాంట్ల నిర్మాణాలు ప్రారంభం



మారందొడ్డిలో ఆర్వో ప్లాంట్ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శాంతమ్మ

**సి.బెళగల్:** మండలంలోని రెండు గ్రామాల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ల నిర్మాణాలను ప్రారంభించినట్లు మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ తెలిపారు. మారందొడ్డి, గొల్లలదొడ్డి గ్రామ పంచాయతీలలో ఆర్వో వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు కర్నూలు పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) నుంచి రూ.8 లక్షలు మంజూరు కావడంతో మారందొడ్డి సర్పంచ్ శాంతమ్మ, గొల్లలదొడ్డి సర్పంచ్ రామలింగమ్మ గురువారం పనులను ప్రారంభించారు.

### నేడు రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ ప్రారంభం

**కోడుమూరు రూరల్:** స్థానిక బీసీ కాలనీ, లక్ష్మీనగర్‌లలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలతో పాటు, వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి గురువారం తెలిపారు. కార్యక్రమానికి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సతీష్ హాజరవుతారన్నారు.

### ఏపీఎంగా సుధాకర్

**గూడూరు:** గూడూరు వైకేపీ ఏపీఎంగా ఎస్.సుధాకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేస్తున్న చక్రధర్ జిల్లా కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సుధాకర్‌ను జిల్లా అధికారులు నియమించారు.

### కేసీ కాల్వకు నీటి విడుదల

**గూడూరు:** సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు గురువారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.089 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు తెలిపారు.

### వేసవిలో పత్తి సాగు వద్దు



పుస్తకాలను అందజేస్తున్న ఏఓ

**కోడుమూరు రూరల్:** వేసవిలో బోరుబావుల కింద రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ పత్తి సాగు చేయరాదని ఏఓ రవిప్రకాష్ సూచించారు. మండలంలోని గోరంట్ల రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. కాసేపు రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు.వ్యవసాయానికి సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. పొలాల్లో మిగిలి పోయిన పంట, కలుపు మొక్కలను తీసివేసి గట్లపై కాల్చివేయాలని, వేసవి దుక్కులు దున్నుకోవాలని సూచించారు. అనంతరం రబీ కింద పంట నమోదు చేయించుకున్న రైతులకు పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

### పోలింగ్ కేంద్రాల తనిఖీ



కంబదహాల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

**సి.బెళగల్:** ఈఓఆర్డీ, ఎన్నికల సెక్టోరియల్ అధికారి సందీప్ గురువారం మండలంలోని సి.బెళగల్, గొల్లలదొడ్డి, కంబదహాల్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడి వసతులు, సౌకర్యాలు, సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

### విద్యార్థులు ఇష్టంతో చదవాలి



పదో తరగతి విద్యార్థులతో సర్పంచ్, ఉపాధ్యాయులు

**గడివేముల:** విద్యార్థులు ఇష్టంతో చదివితే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకుంటారని సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గడిగరేవుల జెడ్పీ హైస్కూల్‌లో ఫేర్‌వెల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. బాలబాలికలు పదో తరగతిలో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న 52 మంది విద్యార్థులకు పరీక్షలు రా సేందుకు అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జక్కుల సావిత్రి,ఉప సర్పంచ్ గోదాప్రసాద్, ఉపాధ్యాయులు దస్తగిరమ్మ, నగిరి శ్రీనివాసులు, పీఎంసీ మాజీ చైర్మన్ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- గ్రామాల్లో రూ.2.94 కోట్లతో కార్యాలయ భవనాల నిర్మాణం
- ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం



సోమయాజులపల్లెలో రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

**ఓర్వకల్లు :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్థాయిలోనే రూ.కోట్లతో భవనాలను నిర్మించినట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వేర్వేరు గ్రామాలలో సుమారు రూ. 2.95 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. సోమయాజుల పల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను ప్రారంభించారు. ఆ తర్వాత ఉప్పలపాడు గ్రామంలో నిర్మించిన సచివాయం, కాల్వబుగ్గలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. అనంతరం కాల్వ గ్రామంలో నిర్మించిన సచివాలయం-2, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు, బ్రాహ్మణపల్లె గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, సచివాలయ భవనాల ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించారు.

**గతంలో ఏ ప్రభుత్వమూ చేయనంత అభివృద్ధి**

మండలంలో గతంలో ఏ ప్రభుత్వాలు చేపట్టని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారని ఎమ్మెల్యే అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కనీసం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించలేక పోయారని, రాష్ట్రానికి వచ్చిన నిధులను నీరు - చెట్టు పేరుతో దోచుకు తిన్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలో ప్రజలకు ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. పచ్చపత్రికల్లో పిచ్చిరాతలు రాయించడం, దుష్ప్రచారాలు మానుకొని వారు చేసిన అభివృద్ధిని చూపించాలని హితవుపలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కుల, మతాలు, రాజకీయ వర్గ విభేదాలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంతృప్తస్థాయిలో సంక్షేమ పథకాలను మంజూరు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడం అభివృద్ధికి నిదర్శనమన్నారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ రంగనాథ్‌గౌడు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, సర్పంచులు జయమ్మ, అయ్యస్వామి , పెద్ద వెంకటేశ్వర్లు, జయభారతమ్మ, ఎంపీడీఓ మ ల్లీశ్వరి, ఈఓఆర్డీ సుబ్బరాయుడు, నాయకులు వెంకటరెడ్డి, మదన్ వెంకటరెడ్డి, మధు, దస్తగిరి, ఎల్లారెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### మార్చి 30లోపు పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

**కల్లూరు:** ప్రభుత్వ పాఠశాలలో మనబడి నాడు-నేడు రెండో దశ కింద ఎంపికైన పాఠశాలలో పనులు మార్చి 30లోపు పూర్తి చేయాలని ఎంఈఓ-1 శ్రీనివాసులు అన్నారు. గురువారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఏపీడబ్ల్యూఐడీసీ డీఈ నాగరాజు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాఠశాలలో జరిగే నాడు-నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణమూర్తి, ఎంఈఓ-2 వనజకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు



బూజునూరు గ్రామ సమీపంలోని ఎస్‌ఆర్‌బీసీని పరిశీలిస్తున్న దృశ్యం

**గడివేముల:** మండల పరిధిలోని బూజునూరు గ్రామ సమీపంలోని ఎస్‌ఆర్‌బీసీ కాలువపై బ్రిడ్జి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఫిబ్రవరి 2న జరిగిన జీరో అవర్ అసెంబ్లీలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎస్‌ఆర్‌బీసీ అధికారులు గురువారం పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని అధికారులు తెలిపారు. గత కొన్ని ఏళ్లుగా వర్షాలు పడినప్పుడు పశువులను మేపుకునేందుకు, పొలాలకు వెళ్లడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన అసెంబ్లీలో ప్రస్తావించారని మండల పార్టీ అధ్యక్షుడు శివరామిరెడ్డి తెలిపారు. బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులకు గ్రామస్తులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

## మన్‌మీట్‌లో శాంతిరాం విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం

**పాణ్యం:** మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి మన్‌మీట్‌లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలులోని అశోక ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన మన్‌మీట్ సదస్సులో తమ కళాశాలకు చెందిన బృహతిమానస ప్రతిభ కనబరిచిన మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇందుకు గాను కళాశాల యాజమాన్యం విద్యార్థినికి ప్రశంసా పత్రం అందించినట్లు చెప్పారు. విద్యార్థినిని, కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. అలాగే ఈ నెల 13తేదీన అశోక ఉమెన్స్ కళాశాలలో జరిగిన జాతీయ సాంకేతిక సదస్సుల్లో తమ కళాశాలకు చెందిన ఉదయసింహ, సమీర్ సర్క్యూట్ డిబగింగ్ ప్రాజెక్టులో ప్రతిభ చాటుకున్నారన్నారు. విద్యార్థులను ఎండీ శివరాం, హెచ్ఓడీ మల్లికార్జున, కో-ఆర్డినేటర్ శంకర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



పైపు లైన్ పనులను పరిశీలిస్తున్న ఏఈ పవన్

**గడివేముల:** వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్ తెలిపారు. మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో గురువారం సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డితో కలిసి పైపులైను పనులను పరిశీలించారు. జలజీవన్ మిషన్ కింద రూ.93 లక్షలతో 90 వేల లీటర్ల కెపాసిటీతో ట్యాంకు, పైపులైన్లను నూతనంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేసి గ్రామస్తులకు తాగునీరు అందిస్తామన్నారు. పాణ్యం ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

## ఉచిత ఎక్స్‌రేను సద్వినియోగం చేసుకోండి



ఉచిత ఎక్స్‌రే క్యాంప్‌ను సందర్శిస్తున్న డాక్టర్ మిథున్‌రెడ్డి, సర్పంచ్ పాండురంగన్న

**సి.బెళగల్:** సంచార వాహనం ద్వారా నిర్వహిస్తున్న ఉచిత ఎక్స్‌రే క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి, సర్పంచ్ పాండురంగన్న సూచించారు. గురువారం మండల కేంద్రంలో క్షయ వ్యాధి అనుమానుతుల కోసం టీబీ సూపర్‌వైజర్ మహేంద్ర నిర్వహించిన సంచార ఎక్స్‌రే వాహన క్యాంప్‌ను డాక్టర్, సర్పంచ్ సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దీర్ఘకాలిక దగ్గు, బరువు తగ్గటం, ఆకలి లేకపోవడం, ఉమ్మిలో రక్తం తదితర లక్షణాలు ఉన్న వారు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం టీబీ చికిత్స పొందే వారి బ్యాంక్ ఖాతాలకు నెలకు రూ.500, నెలకు ఒకటి చొప్పున పౌష్టికాహారం కిట్ (ఫుడ్ బాస్కెట్) చొప్పున ఆరు నెలలపాటు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. టీబీ సూపర్‌వైజర్ మహేంద్ర మాట్లాడుతూ శుక్రవారం గుండ్రేవుల గ్రామంలో ఎక్స్‌రే సంచార సేవలను అందించనున్నట్లు తెలిపారు.

## కేంద్ర బలగాల కవాతు



కె.మార్కాపురంలో పర్యటిస్తున్న కేంద్ర సాయుధ పోలీసు బలగాలు

**గూడూరు రూరల్:** కె.నాగలాపురం, కర్నూలు రూరల్ సర్కిల్, సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం సెంట్రల్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్ నబీన్ దాస్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కర్నూలు రూరల్ సర్కిల్ సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉలిందకొండ ఎస్ఐ నరేష్, కె.నాగలాపురం పోలీసులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ఉండాలి



చింతమానుపల్లెలో రైతులతో కలిసి వ్యవసాయ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

**సి.బెళగల్:** ఆర్బీకేలలో రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన మండలంలోని సంగాల, చింతమానుపల్లె గ్రామాల ఆర్బీకేలను తనిఖీ చేశారు. ఆర్బీకేల ద్వారా రైతులకు వ్యవసాయ అంశాలపై సమగ్ర సమాచారం అందించే డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా మ్యాగజైన్ (వ్యవసాయ దర్శిని పుస్తకం) అవసరాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏలు ప్రవీన్, సంధ్య, వెంకటేష్ ఉన్నారు.

# కోడుమూరులో వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపిద్దాం

- కర్నూలు అర్బన్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభం
- హాజరైన కోడుమూరు ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

**కర్నూలు (సిటీ):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేసి కోడుమూరు నియోజకవర్గంలో ముచ్చటగా మూడోసారి భారీ మెజారిటీతో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కర్నూలు పార్లమెంటు అధ్యక్షులు, మేయర్ బీవై రామయ్య, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని కర్నూలు అర్బన్‌లో ఉన్న 38, 39, 40 వార్డులలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయం తక్కువగా ఉందని, ప్రతి కార్యకర్త ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేక విఫలమయ్యారని, ఎన్నికలకు ముందుగానే వారికి ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకే జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలు పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. పేదవాడికి సంక్షేమ పథకాలు అందాలంటే కచ్చితంగా వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాల్సిందేనని, కావున ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లా పనిచేసి రాబోయే ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గ అభ్యర్థి, కర్నూలు పార్లమెంటు అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 39వ వార్డు కార్పొరేటర్ సాంబశివరావు, 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రశాంత్, యువజన విభాగం జిల్లా కార్యదర్శి గిరిప్రసాద్, పార్టీ కార్యకర్తలు కిరణ్, మధుశేఖర్, రజియా, శేషన్న, రాము, మధుసూదన్, యేసుదాసు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

**కర్నూలు సమగ్ర** నీటి పథకం, మురుగునీటి శుద్ధి కేంద్రాలకు గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, శ్రీదేవి, సుధాకర్, కలెక్టర్ డాక్టర్ సృజన, జేసీ మౌర్య, మేయర్ బీవై రామయ్య, నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్, ఎస్వీ విజయమనోహరి, తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, కమిషనర్ భార్గవ్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.



### డైట్ కాలేజ్ ప్రిన్సిపాల్‌కు పదోన్నతి



బాధ్యతలు స్వీకరిస్తున్న పి.వసుంధరా దేవి

**కర్నూలు (సిటీ):** ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా (ఎఫ్ఏసీ ) పూర్తి అదనపు బాధ్యతలు ని ర్వహిస్తున్న సీనియర్ అధ్యాపకురాలు పి.వసుంధరా దేవి పాఠశాల విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన ఆమెను డైట్ కాలేజీకి రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

### సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో ప్రతిభ



వై. అభిలాషిత

**పాణ్యం :** జాతీయ సైనిక్ స్కూల్ ఎంపిక పరీక్షల్లో పాణ్యంకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. గురువారం వెలువడిన ఫలితాల్లో స్థానిక విజయా నికేతన్ పాఠశాల విద్యార్థిని వై. అభిలాషి త జాతీయ స్థాయిలో 5,361 ర్యాంక్ సాధించింది. అలాగే ఎం. విక్కిరాజు 8,814 ర్యాంక్, ఆర్. గౌతమ్‌తేజ్ 9,446 ర్యాంక్‌లు సాధించారని పాఠ శాల డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

### మే నెలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

**కర్నూలు (టౌన్):** జిల్లా వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మే నెల 1 వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి క్రీడా శిక్షణ శిబి రాల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ ల్లో పాల్గొన్న సీనియర్ క్రీడాకారులు, వ్యాయా మ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హతలను, శిక్షణ నిర్వహించే క్రీడాంశం, వేదిక, క్రీడా సామగ్రి ఇతర వివరాలను ఈనెల 20 తేదీలోపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## మూత్రపిండాల సమస్యలపై అవగాహన కల్పించాలి




ర్యాలీలో పాల్గొన్న ఆసుపత్రి అధికారులు, వైద్యులు

**కర్నూలు(హాస్పిటల్):** మూత్రపిండాల సమస్యలపై ప్రజలు అవగాహన కలిగించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సూచించారు. గురువారం అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలోని నెఫ్రాలజీ, యురాలజీ విభాగాల ఆధ్వర్యంలో నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రిలో ర్యాలీని ప్రారంభించిన అనంతరం డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ మన శరీరంలో కిడ్నీ ముఖ్యమైన భాగమన్నారు. ఇది ఎలాంటి చెడు పదార్థాలనైనా వడబోసి బయటకు పంపించేందుకు ఉపయోగపడుతుందన్నారు. డయాబెటీస్, స్థూలకాయం, హైపర్‌టెన్షన్ కారణంగా ఇది జబ్బులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ మూడు జబ్బులను నియంత్రించుకుంటే కిడ్నీ సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. కిడ్నీ సంబంధిత డైట్‌ను ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. ఉప్పు వద్దు...పప్పు ముద్దు నినాదంతో వచ్చిన అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం రోజు నుంచి ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో మార్పు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నెఫ్రాలజీ విభాగం వైద్యులు జిక్కి, అనంత్, వెంకటపక్కిరెడ్డి, శ్రీధరశర్మ, యురాలజీ హెచ్ఓడీ డాక్టర్ సీతారామయ్య, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్ వెంకటతులశమ్మ పాల్గొన్నారు.

## నదులను పరిరక్షించుకుందాం



నివేదికను విడుదల చేస్తున్న మేధావులు

**కర్నూలు(సిటీ):** హంద్రీ, తుంగభద్ర నదుల మధ్యలో విరజిల్లుతున్న నాగరికత కర్నూలు నగరానిదని, ప్రతి ఒక్కరూ ఈ నదులను పరిరక్షించుకుని మానవ జీవితాలను కాపాడుకుందామని కర్నూలు జిల్లా మేధావుల వేదిక పిలుపునిచ్చింది. గురువారం నగరంలోని తెలుగు తోటలో అంతర్జాతీయ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నదుల సంరక్షణపై చర్చాగోష్ఠి నిర్వహించారు. వేదిక వ్యవస్థాపకులు ఆచార్య మన్సూర్ రెహమాన్, గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్ కల్కూరా, తెలుగుభాష వికాస ఉద్యమ అధ్యక్షులు జేఎస్ఆర్‌కే శర్మ ప్రసంగించారు. తుంగభద్ర, హంద్రీ నదులు మానవుని స్వార్థానికి బలై మురుగునీటితో, కలుషిత రసాయనాలతో విష వలయంగా మారాయన్నారు. నిర్లక్ష్యం చేస్తే మానవ సమాజానికి, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నదుల సంరక్షణపై నగరవాసుల్లో చైతన్యం తెచ్చేందుకు తమ వేదిక కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం కర్నూలు నగరం ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీర్, కాలుష్య నియంత్రణ మండలికి అందజేశామన్నారు. సమావేశంలో చరిత్రకారులు బి.ఇమ్మానుయేల్, విశ్రాంత జాయింట్ డైరెక్టర్ ఎంవీఆర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో సతీష్, హర్షవర్ధన్ రెడ్డి

**కర్నూలు సిటీ:** ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సి.బెళగల్ మండలానికి చెందిన దుబ్బన్న కుటుంబానికి రూ.2 లక్షలు, బెస్త వెంకటేశ్వరి కుటుంబానికి రూ.2 లక్షలు, మాల జమ్మన్న కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున మంజూరు కావడంతో చెక్కులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి, సర్పంచు పాండురంగడు, కో-ఆప్షన్ మెంబర్ హరుణ్, జేసీఎస్ కన్వీనర్ తులసిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా పాల్గొన్నారు.